సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 22 । ఆగస్టు । 2023



జనజీవన గీతం.. జానపదం
పల్లె జీవనం నుంచి, పామరుడి శ్రమ నుంచి **పుట్టిందే జానపదం. ఆ శ్రామికుడు పాడుకున్నదే జానపద గీతం.** 8లో



వారియర్స్ సూపర్ విజయం
ఏపీఎల్ రెండో సీజన్‌లో ఓ మ్యాచ్ టై గా ముగిసింది. సూపర్ ఓవర్‌లో వైజాగ్ వారియర్స్ విజయం సాధించింది. 8లో



కల్యాణ'మస్తు'!
దాదాపు రెండు నెలల విరామం తర్వాత పెళ్లి ముహూర్తాలు మళ్లీ మొదలయ్యాయి. పురోహితులకు డిమాండ్ ఏర్పడింది. 12లో

న్యూస్‌రీల్

ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలకు రండి

కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రికి **ఆహ్వానం**



కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవియాకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఎంసీ సెంటినరీ సెలబ్రేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిరాజు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ(ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలకు హాజరుకావాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాను ఏఎంసీ సెంటినరీ సెలబ్రేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిరాజు కోరారు. ఈ మేరకు సోమవారం ఢిల్లీలోని నార్మన్ భవన్‌లో ఆయన్ని కలిశారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఏఎంసీ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పూర్వ విద్యార్థుల తరపున సుమారు రూ.50 కోట్లతో భవనం నిర్మిస్తున్నట్టు పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాలకు వస్తానని హామీ ఇచ్చినట్టు రవిరాజు వివరించారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో మహిళా ప్రతినిధి డాక్టర్ టి.రాధ ఉన్నారు.

దువ్వాడ వీఎస్ఈజెడ్ రికార్డు స్థాయి ఎగుమతులు



శ్రీనివాస్

అగనంపూడి : దువ్వాడ వీఎస్ఈజెడ్ పరిధిలోని తెలుగు రాష్ట్రాల్లోని సెజ్‌లు, యూనిట్ల ద్వారా రికార్డు స్థాయి ఎగుమతులు సాధించినట్టు వీఎస్ఈజెడ్ జోనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్ తెలిపారు. మొదటి త్రైమాసికం (ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు)లో రూ.50,195 కోట్ల విలువైన వస్తువులు, సేవలను ఎగుమతులు చేసినట్టు పేర్కొన్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 34 శాతం వృద్ధి రేటు సాధించినట్టు చెప్పారు. వివిధ వస్తువులను ఉత్పత్తి చేయడం ద్వారా రూ.35,992 కోట్లు, సేవలను ఎగుమతులు చేయడం ద్వారా రూ.14,203 కోట్లు మేరకు విదేశీ మారకద్రవ్యం లభ్యమైనట్టు తెలిపారు. సేవా రంగంలో 36 శాతం వృద్ధి, వస్తువుల ఉత్పత్తి రంగంలో 28 శాతం వెరసి 34 శాతం పెరుగుదల కనిపించినట్టు పేర్కొన్నారు. రూ.1,04,961 కోట్ల పెట్టుబడుల ద్వారా 6,61,579 మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. మొదటి త్రైమాసికంలో 12 యూనిట్ల ఏర్పాటుకు ఆమోదం తెలపడం జరిగిందని, రెండు తెలుగు రాష్ట్రాల్లో సుమారు 2 వేల కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టడం జరుగుతుందని, సంస్థలు నెలకొల్పితే 3 వేల మందికి ఉపాధి లభ్యం కానుందని పేర్కొన్నారు.

నేడు కేంద్ర ఉక్కు కార్యదర్శి స్టీల్‌ప్లాంట్ సందర్శన

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు కార్యదర్శి నాగేంద్ర నాథ్ సిన్హా మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించనున్నారు. ఉదయం ఎయిర్‌పోర్టు నుంచి హిల్ టాప్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ సీఐఎస్ఎఫ్ గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్లాంట్‌ను సందర్శించనున్నారు. మధ్యాహ్నం ఉక్కు పరిపాలన భవనంలో యాజమాన్యం అందించనున్న కార్పొరేట్ ప్రజంటేషన్ తిలకించనున్నారు. మధ్యాహ్నం వివిధ కార్మిక సంఘాలు, అసోసియేషన్లతో సమావేశం కానున్నారు. అనంతరం ఆయన సింహాచలం దేవస్థానానికి వెళ్లనున్నారు. రాత్రికి రైలులో జగదల్‌పూర్‌కు వెళ్లనున్నారు.


స్పెషల్ బార్ మిల్ రికార్డ్ ఉత్పత్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్పెషల్ బార్ మిల్ (ఎస్‌బీఎం) ఆదివారం రికార్డు ఉత్పత్తి సాధించింది. రాత్రి షిఫ్ట్‌లో 794 టన్నులు ఉత్పత్తి చేయడం ద్వారా గతంలో చేసిన ఉత్పత్తి రికార్డును అధిగమించారు. రికార్డు ఉత్పత్తి సాధించిన స్పెషల్ బార్ ఉద్యోగులను, కాంట్రాక్ట్ కార్మికులను స్టీల్ వైఎస్సార్‌టీయూసీ నాయకులు అభినందించారు.

కాంట్రాక్ట్ వైద్యుల భర్తీకి నోటిఫికేషన్

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ వైద్యుల నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. సర్జరీ, గైనిక్, జనరల్ మెడిసిన్ విభాగాల అవసరాల కోసం ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో 35 ఏళ్ల గరిష్ఠ వయోపరిమితి కలిగిన అభ్యర్థులను ఆహ్వానిస్తున్నారు. మొదట ఏడాది వ్యవధితో భర్తీ చేస్తారు. ఆ తర్వాత వారి సేవలను బట్టి కొనసాగించడానికి అవకాశం ఉంటుంది. రూ.50 వేల స్టైఫండ్‌తో కూడిన ఈ పోస్టుల కోసం ఈనెల 30న ఉదయం 10 నుంచి 12 వరకు ఆస్పత్రి హెచ్‌వోడీ కార్యాలయం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అదే రోజు మధ్యాహ్నం 12 నుంచి రెండు గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో.. విశాఖ పోర్టు 1 నంబర్



ఎగుమతులకు సిద్ధమవుతున్న సముద్ర ఉత్పత్తులు

అవసరాలకు అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచుకుంటున్న విశాఖ పోర్టు అథారిటీ.. సరకు రవాణాలో సరికొత్త రికార్డులు నెలకొల్పింది. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో దేశంలోని అన్ని పోర్టులను వెనక్కినెట్టి నంబర్ వన్‌గా నిలిచింది. ఓవైపు మౌలిక వసతుల కల్పనతో పాటు జెట్టీలు, కంటైనర్ టెర్మినల్ విస్తరణ, రవాణా, అనుసంధాన ప్రాజెక్టుల పనులను శరవేగంగా చేపడుతోంది. మరోవైపు కార్గో రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి.. దేశంలోని మేజర్ పోర్టుల్లో నంబర్ వన్‌గా నిలిచేందుకు అడుగులు వేస్తోంది.

– సాక్షి, విశాఖపట్నం

- 2022–23 ఆర్థిక సంవత్సరంలో 2.64 లక్షల మెట్రిక్ టన్నుల ఎగుమతులు
- రూ.16,877 కోట్ల విలువైన సంపదతో మొదటి స్థానంలో నిలిచిన పోర్టు
- తర్వాత స్థానాల్లో కోచి, కోల్‌కతా పోర్టులు
- కార్గో రవాణాపై ప్రత్యేక దృష్టిసారించిన వీపీఏ

మెరైన్ ఉత్పత్తుల ఎగుమతుల సెగ్మెంట్‌లో విశాఖపట్నం పోర్టు అథారిటీ నంబర్‌వన్‌గా నిలిచింది. సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ(ఎంపెడా) విడుదల చేసిన నివేదికలను అనుసరించి.. సముద్ర ఉత్పత్తులు ఎగుమతుల్లో దేశంలోనే విశాఖపట్నం పోర్టు ఏకంగా 26.36 శాతం వాటాను కలిగి ఉండటం విశేషం. 2022–23 వాణిజ్య సంవత్సరానికి సంబంధించిన లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న పోర్టుల నుంచి రూ.63,969.14 కోట్ల విలువైన 17,35,286 మెట్రిక్ టన్నుల సముద్ర ఉత్పత్తులు ఆయా దేశాలకు ఎగుమతులు జరిగాయి. ఇందులో విశాఖపట్నం పోర్టు నుంచి రూ.16,877 కోట్ల విలువైన 2,64,214 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఎగుమతి కావడం విశేషం.

విశాఖ వైపు పక్క రాష్ట్రాల చూపు

పోర్టు పక్కనే ఫిషింగ్ హార్బర్.. దానికి ఆనుకుని సముద్ర ఉత్పత్తుల ఎగుమతి సంస్థలు ఎక్కువ సంఖ్యలో ఉండటమే విశాఖ పోర్టు మొదటి స్థానంలో నిలవడానికి ప్రధాన కారణం. దీంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు కూడా దోహదపడుతున్నాయి. విశాఖ సమీప సముద్ర తీరంలో నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తున్నాయి. దీంతో పాటు ఎగుమతులకు సరైన సౌకర్యాలు ఇక్కడ ఉండటంతో ఏపీతో సమీప రాష్ట్రాలు కూడా విశాఖ వైపు మొగ్గు చుపుతున్నాయి. ముఖ్యంగా ఒడిశాకు చెందిన ఎగుమతిదారులు కూడా విశాఖ పోర్టుపైనే ఆధారపడుతుండటం కలిసొస్తున్న అంశంగా మారింది. ఈ కారణంగానే కొచ్చి, కోల్‌కతా పోర్టులను వెనక్కు నెట్టి.. విశాఖపట్నం పోర్టు సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో నంబర్‌వన్‌గా నిలిచింది.

సరకు రవాణాలోనూ సత్ఫలితాలు

ఎగుమతులను ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, కేంద్ర ప్రభుత్వ సహకారం.. సరకు రవాణాలో సత్ఫలితాలను అందిస్తున్నాయి. విశాఖపట్నం పోర్టులో 32 బెర్తులుండగా.. సమీపంలోని గంగవరం పోర్టులో 9 బెర్తులున్నాయి. ఇందులో మొత్తం 23 బెర్త్‌ల ద్వారా కార్గో కంటైనర్ ఎక్స్‌పోర్ట్స్ జరుగుతున్నాయి. విశాఖ నుంచి ఎక్కువగా అమెరికా, చైనా, యూఏఈ, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, ఇటలీ, వియత్నాం, జపాన్, కెనడా దేశాలకు ఎగుమతులు చేస్తారు. చానల్స్, బెర్తులను మరింత లోతుగా విస్తరించడం ద్వారా అంతర్గత వనరుల నుంచి సైతం ఆదాయం ఆర్జించేలా వైజాగ్ పోర్టు మార్గాలను అన్వేషిస్తోంది. ఎగుమతుల్లో వృద్ధికి ఉన్న అన్ని అంశాలను సద్వినియోగం చేసుకుంటూ.. వీపీఏ జోరు కొనసాగిస్తోంది.



సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు ఇలా...

పోర్టు	ఎగుమతులు (మెట్రిక్ టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)
విశాఖపట్నం	2,64,214	16,876.93
కొచ్చి	2,25,230	7,550.48
కోల్‌కతా	1,25,193	6,481.60
జేఎన్‌పీటీ (ముంబయి)	2,26,540	5,892.69
చెన్నై	1,04,604	5,284.52

ఆశలన్నీ ఎన్‌ఎస్‌టీఎల్‌పైనే..



జాతీయ స్థాయి క్రీడా పోటీల విజేతలతో డీజీ శ్రీనివాసరావు, ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డా.అబ్రహాం వర్గీస్

- అండర్ వాటర్ వెపన్ కేంద్రంగా విశాఖ
- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు
- ఘనంగా ఎన్ఎస్‌టీఎల్ 54వ ల్యాబ్ రైజింగ్ డే

సాక్షి, విశాఖపట్నం : రక్షణ రంగంలో కీలకంగా వ్యవహరిస్తున్న నేవల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లేబొరేటరీ(ఎన్ఎస్‌టీఎల్)పై భారత నౌకాదళం మాత్రమే కాకుండా.. దేశం మొత్తం ఎన్నో ఆశలు పెట్టుకుందని భారత రక్షణ పరిశోధన సంస్థ(డీఆర్‌డీవో) డైరెక్టర్ జనరల్ డా.వై శ్రీనివాసరావు తెలిపారు. ఎన్ఎస్‌టీఎల్‌లోని మహాపాత్ర ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన 54వ ల్యాబ్ రైజింగ్ డే ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థలో 25 ఏళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అదేవిధంగా.. ఎన్ఎస్‌టీఎల్ తరపున వివిధ క్రీడల్లో జాతీయ స్థాయి విజేతలుగా నిలిచిన క్రీడాకారులైన ఉద్యోగులకు డా.వై శ్రీనివాసరావు చేతులమీదుగా జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేక్ ఇండియాలో భాగంగా స్వదేశీ ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం పెరగడంతో ఎన్ఎస్‌టీఎల్‌పై మరింత బాధ్యత పెరిగిందన్నారు. అండర్ వాటర్ వెపన్ కేంద్రంగా విశాఖను అభివృద్ధి చేసే విషయంలో ఎన్ఎస్‌టీఎల్ ముఖ్య భూమిక పోషిస్తోందని వివరించారు. అనుబంధ పరిశ్రమలు, విద్యా సంస్థల మద్దతుతోనే ఇది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. పరిశ్రమలను ప్రోత్సహించడంతో పాటు పరిశోధనలు జరుగుతున్న విద్యా సంస్థలకు బాసటగా నిలిస్తే వేలాది మంది శాస్త్రవేత్తల్ని తయారు చేయవచ్చని సూచించారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డా.అబ్రహాం వర్గీస్ మాట్లాడుతూ రాబోయే ఐదేళ్లకు సంబంధించి డీఆర్‌డీవో నిర్దేశించిన లక్ష్యాల్ని చేరుకునేందుకు ఎన్ఎస్‌టీఎల్ శాయశక్తులా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు వినూత్న సాంకేతికతల్ని అందుకుంటూ భవిష్యత్తులో రక్షణ రంగంలో కీలకంగా వ్యవహరించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎన్ఎస్‌టీఎల్ సేవాసమితి, మహిళా కల్యాణ్ మంచ్ పేరుతో ఉద్యోగులు, అధికారులు అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఎన్ఎస్‌టీఎల్ అధికారులు, ఉద్యోగులు, యూనియన్ ప్రతినిధుల సహకారంతో 82 వరకూ కార్యక్రమాలు నిర్వహించినట్లు డా.అబ్రహం తెలిపారు. కార్యక్రమంలో ఎల్ఆర్‌డీసీ చైర్మన్, సైంటిస్ట్–జి డా.వీసీ ప్రవీణ్, బీవీఎస్ఎస్ కృష్ణకుమార్, శాస్త్రవేత్తలు జేఎస్ వర్మ, డా.హెచ్ఎస్ దాస్, జి.నాగభూషణం, ఎన్ఎస్‌టీఎల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ సీహెచ్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఐటీఐలో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం: జిల్లాలో వివిధ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మూడో విడత ప్రవేశానికి ఈనెల 27వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని దగ్గరలోని ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డు గల వారు ప్రత్యేక కేటగిరిలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 31న ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ప్రభుత్వ ఐటీఐ కంచరపాలెం, ప్రభుత్వ ఐటీఐ(బాలికలు)–ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రభుత్వ ఐటీఐ(కొత్తది) గాజువాక, ప్రభుత్వ ఐటీఐ నరవలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

శతశాతం పూర్తయ్యే వరకూ ఇంటింటా ఓటరు సర్వే

- జిల్లా అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశం
- ఇప్పటి వరకూ 85.69 శాతం పూర్తి

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణ–2024 కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా నిర్వహిస్తోంది. ఇంటింటా ఓట్ల పరిశీలన, కొత్త వారి నమోదుకు దరఖాస్తుల స్వీకరణ, సవరణలు చేపట్టే కార్యక్రమానికి సోమవారంతో గడువు ముగిసింది. అయితే శతశాతం పూర్తి చేసేంత వరకూ సర్వే కొనసాగించాలని జిల్లా యంత్రాంగానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు వృథా కాకుండా జాబితాలో చేర్చేందుకు నిశితంగా పరిశీలన చేయాలని సూచించింది. జూలై 21 నుంచి ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం–2024 జిల్లా పరిధిలోని 7 నియోజకవర్గాల్లో ప్రారంభమైంది. నెల రోజుల పాటు జరిగే ఈ డోర్ టు డోర్ సర్వేల బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వోలు) వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవల్ ఏజెంట్స్ (బీఎల్ఏ)లతో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ప్రతి ఓటును పరిశీలిస్తున్నారు. సర్వే నిర్వహించిన ప్రతి ఇంట్లోనూ కొత్త ఓటర్లు ఉన్నారా.? ఆ చిరునామాతో ఉన్న ఓటర్లు ఉన్నారా.? లేకపోతే ఎక్కడికి వెళ్లారు..? ఆ ఓటుని తీసెయ్యాలా.? చిరునామా మార్పు చేయాలా.. ఇలా విభిన్న కోణాల్లో వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో ఉన్న 1945 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 7,61,667 ఇళ్లుండగా... ఇందులో మొత్తం 18,83,861 ఓటర్లున్నారు. 21 నుంచి నిర్వహిస్తున్న సర్వేలో చివరి రోజైన శనివారం వరకూ చూస్తే.. 6,58,849 ఇళ్లలో ఉన్న 16,24,759 మంది ఓటర్ల వివరాలను పరిశీలించారు. కలెక్టర్ డా.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ.. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు సక్రమంగా ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారా లేదా అనే అంశాలపై నిశిత పరిశీలన చేస్తున్నారు. ఇప్పటి వరకూ 85.69 శాతం పరిశీలన పూర్తయిందని, వీలైనంత త్వరగా 100 శాతం పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు.

'హాలిడే' చీటర్స్

- విహారయాత్ర పేరుతో మోసం
- 200 మంది నుంచి రూ.2 కోట్లు వసూలు
- సంస్థ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

బీచ్‌రోడ్డు : హాలో.. మీ పేరు మీద లక్కీడిప్ వచ్చింది. విలువైన బహుమతి మీ సొంతం అంటూ ఫోన్ చేస్తారు. ఫ్యామిలీతో వచ్చి బహుమతి తీసుకోవాలని సూచిస్తారు. అది నమ్మి వెళ్తే మన జేబు ఖాళీ చేస్తారు. అతి తక్కువ మొత్తానికి విహార యాత్రకు తీసుకువెళతామని ఆశ చూపి డబ్బులు కాజేసి బోర్డు తిప్పేస్తారు. తాజాగా ఇటువంటి సంఘటన విశాఖలో చోటుచేసుకుంది. విహార యాత్ర పేరుతో సుమారు 200 మంది వద్ద నుంచి రూ. 2 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేశారు. తిరిగి ప్రజలను మోసం చేసేందుకు వేరే పేరుతో సంస్థను ప్రారంభించారు. విషయం తెలుసుకున్న బాధితులు సోమవారం ఆ సంస్థ వద్ద ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రెండేళ్ల క్రితం మహేష్, రామరాజు, సురేష్ అనే ముగ్గురు హాలిడే ఫ్యాక్టరీ పేరుతో ఓ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ద్వారా విహారయాత్రలకు పంపిస్తామని చెప్పి నగదు వసూలు చేసిన అనంతరం మొహం చాటేశారు. ఈ ముగ్గురిలో మహేష్ కాకినాడలో వేరే పేరుతో సంస్థను ఏర్పాటు చేసుకుంటే రామరాజు, సురేష్‌లు వీఐపీ రోడ్డులోని వీఐపీ టవర్స్‌లో హాలిడే వండర్స్ పేరుతో సంస్థను ప్రారంభించారు. విషయం తెలుసుకున్న బాధితులు సోమవారం అక్కడకి చేరుకొని ఆందోళన చేశారు. అప్పటికే రామరాజు, సురేష్‌లు అక్కడ నుంచి జారుకున్నారు. తమకు న్యాయం చేయలంటూ బాధితులు ఆందోళన చేశారు.

పోలీసులకు ఫిర్యాదు

తమకు జరిగిన మోసంపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. సంస్థ డైరెక్టర్లు మహేష్, రామరాజు, సురేష్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ ప్రారంభించారు.

రూ.2.68 లక్షలు చెల్లించా..



2021 ఆగస్టులో నాకు పెళ్లైంది. సెప్టెంబరులో హాలిడే ఫ్యాక్టరీ సంస్థ నుంచి ఫోన్ వచ్చింది. గిఫ్ట్ వచ్చింది అని చెప్తే భార్యతో కలిసి కార్యాలయానికి వెళ్లా. విహారయాత్ర వివరాలు చెప్పారు. చాలా ఆఫర్లు వివరించారు. వారి మాటలు నమ్మి ఐదు దేశాల్లో విహారయాత్రకు రూ.2.68లక్షలు చెల్లించాం. అన్ని ప్రాసెస్ అయిన తరువాత కాల్ చేస్తామని చెప్పారు. రోజులు గడుస్తున్నా ఫోన్ చేయలేదు. దీంతో మేం చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగినా స్పందించలేదు. తరువాత అక్కడ కార్యాలయం మూసేశారు. మళ్లీ వేరే పేరుతో అదే డైరెక్టర్లు రామరాజు, సురేష్‌లు సంస్థను ప్రారంభించారని తెలుసుకొని ఇక్కడికి వచ్చాం. విషయం తెలుసుకున్న వారిద్దరూ ఇక్కడ నుంచి వెళ్లిపోయారు.

– రామకృష్ణ, మాధవధార

అర్జీ పరిష్కారం తర్వాత ఈ–కేవైసీ తప్పనిసరి

- అర్జీదారుడు ఇంటికి వెళ్లి స్పందన తెలుసుకోవాలి
- జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్ మల్లికార్జున



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాస మూర్తి

మహారాణిపేట: జగనన్నకు చెబుదాంలో ఈ–కేవైసీ ప్రక్రియ చాలా ముఖ్యమైనదని, అర్జీదారుని సమస్య పరిష్కరించిన తర్వాత దీనికి సంబంధించి సచివాలయ మహిళా పోలీసు అసిస్టెంట్ ద్వారా అర్జీదారుడు ఇంటికి వెళ్లి వారి స్పందన తెలుసుకోవాలని కలెక్టర్ మల్లికార్జున అన్నారు. సోమవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తప్పనిసరిగా ప్రతి అర్జీలో ఇదే తరహాలో వ్యవహరించాలన్నారు. జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారం వేదికగా జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు నాణ్యమైన పరిష్కారాలు అందించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీవీఎంసీ, రెవెన్యూ, హౌసింగ్, ఈపీడీసీఎల్, ఎండోమెంటు, విద్యాశాఖకు సంబంధించి అర్జీలు ఎక్కువగా పెండింగ్ ఉన్నాయన్నారు. సత్వరం వాటిపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గాల అభివృద్ధి సమీక్షలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు దృష్టి సారించి తక్షణమే పరిష్కరించాలన్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మొత్తం 213 వినతులు అందాయి. రెవెన్యూకు 76, జీవీఎంసీకి 42, పోలీసు 22, ఇతర శాఖలు 73 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, పోలీసులు అధికారులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 38 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల సమస్యలు తెలుసుకుంటున్న నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 38 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ (ఎస్‌బీ) ఐ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పీవీ రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

యుద్ధవీరులకు ఏయూలో ఉన్నతవిద్యకు అవకాశం



ఒప్పంద పత్రాలను రెండు సంస్థల ప్రతినిధులు

ఏయూక్యాంపస్: యుద్ధవీరులకు ఏయూ ఉన్నత విద్య అవకాశాన్ని అందిస్తోంది. దేశ రక్షణలో భాగంగా యుద్ధభూమిలో పోరాడి పదవీ విరమణ చేసిన, యుద్ధంలో అవయవాలు కోల్పోయిన సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు ఏయూలో ఉన్నత విద్యను, డిగ్రీలను పొందే అవకాశం కల్పించింది. ఈ దిశగా ఏయూతో పశ్చిమబంగా సైనిక సంక్షేమ శాఖ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, పశ్చిమబంగా రాజ్య సైనిక్ బోర్డ్ డైరెక్టర్ బ్రిగేడియర్ పార్థో ప్రతిమ్ బారిక్‌లు సంతకాలు చేశారు. అవగాహన ఒప్పందంలో భాగంగా రక్షణ రంగాల ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యుల కు, దేశ రక్షణలో దివ్యాంగులైన సైనికులకు బీఏ ఫైన్ ఆర్ట్స్, పెరఫార్మింగ్ ఆర్ట్స్‌లో సర్టిఫికెట్లు ప్రదానం చేసే విధంగా అవగాహన ఒప్పందం చేసుకున్నారు. రక్షణ రంగాల ఉద్యోగుల భార్యల సంక్షేమ సంఘం నిర్వహించే శిక్షణ కేంద్రాలలో తర్ఫీదు పొందిన, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా నైపుణ్య శిక్షణ పొందిన సైనికుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరీక్షించి మూడేళ్ల, ఐదేళ్ల డిగ్రీలను ప్రదానం చేస్తారు. ఈ సందర్భంగా పశ్చిమబంగా సైనిక్ వెల్ఫేర్ బోర్డ్ డైరెక్టర్ పార్థో ప్రతిమ్ బారిక్ మాట్లాడుతూ సైనికులకు విద్య సంబంధంగా ఉన్న పెద్ద అవరోధాన్ని ఏయూ తొలగించిందన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, అకడమిక్ డీన్ ఆచార్య కిషోర్ బాబు, పరీక్షల విభాగం డీన్ ఆచార్య డీవీఆర్ మూర్తి, జిల్లా సైనిక్ బోర్డ్ ఉపాధ్యక్షుడు కల్నల్ ఎస్.ఎం. బాషా, ఇన్‌చార్జి జేసీవో–సీఆర్‌సీ సుబేదార్ మేజర్ బాజి షేక్ పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 108 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 108 ఫిర్యాదులు వచ్చాయి. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులకు సంబంధించి ఆయా విభాగాధిపతులు పూర్తి సమాచారం సిద్ధం చేయాలన్నారు. ఎన్ని సమస్యలు పరిష్కరించారో వచ్చే స్పందన నాటికి వివరాలు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై. శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవికృష్ణంరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీపీ నరేంద్రరెడ్డి, కార్యదర్శి పి. నల్లనయ్య, డీసీ (రెవెన్యూ) ఫణిరామ్, డీడీ(హార్టీకల్చర్) దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, యూసీడీ పీవో సూర్యకళ, పర్యవేక్షక ఇంజనీర్లు సత్యనారాయణరాజు, వినయ్‌కుమార్, కృష్ణారావు, రామ్మోహనరావు, శ్యాంసన్‌రాజు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ సీయూపీ సంజయ్ రత్నకుమార్‌కు పదోన్నతి

దొండపర్తి: వీఎంఆర్‌డీఏ చీఫ్ అర్బన్ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్‌కు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. టౌన్ ప్లానింగ్‌లో డిప్యూటీ డైరెక్టర్లు 9 మందికి జాయింట్ డైరెక్టర్లగా పదోన్నతి కల్పిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కొంత మందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయగా.. మరికొంత మందిని ప్రస్తుత స్థానాల్లోనే కొనసాగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో వీఎంఆర్‌డీఏ సీయూపీ సంజయ్ రత్నకుమార్ పదోన్నతి పొంది అదే స్థానంలో కొనసాగనున్నారు. అలాగే జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన వి.శిల్ప ప్రస్తుతం ఖాళీగా ఉన్న వీకేపీసీపీఐఆర్ జేడీగాను అదే విధంగా కె.మహాలక్ష్మీదొర జీవీఎంసీ సిటీ ప్లానర్‌గా నియమితులయ్యారు.

నేడు నగరానికి ప్రముఖులు

మహారాణిపేట: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వి.రాధాకృష్ణ కృపసాగర్, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి వి.మురళీధరన్ మంగళవారం విశాఖ రానున్నారు. రాజమండ్రి నుంచి రోడ్డు మార్గంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు హైకోర్టు న్యాయమూర్తి విశాఖ చేరుకొని ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో కాసేపు బస చేస్తారు. అనంతరం మధురవాడ గాయత్రి విద్యా పరిషత్ మెడికల్ కాలేజీలో జరిగే కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం రెండు గంటలకు రాజమండ్రి బయలుదేరి వెళతారు. అలాగే మంత్రి మురళీధరన్ బెంగుళూరు నుంచి విమానంలో మంగళవారం ఉదయం 7 గంటలకు విశాఖ చేరుకొంటారు. పోర్టు గెస్టు హౌస్‌లో బస చేసి స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 5.45 గంటలకు విమానంలో ఢిల్లీ వెళతారు.

జనజీవన గీతం.. జానపదం

పల్లె జీవనం నుంచి, పామరుడి శ్రమ నుంచి పుట్టిందే జానపదం. ఆ శ్రామికుడు పాడుకున్నదే జానపద గీతం. ఇదొక వారసత్వ సంపద, జాతి సాంస్కృతిక చిహ్నం. అక్షరం పుట్టక ముందు నుంచే అక్షయమైన చరిత్రను మౌఖిక రూపంలో భద్రపరుస్తున్న అపురూప కళా రూపం. సాంకేతికత అందుబాటులోకి రాక ముందే ప్రజలకు వినోదాన్ని, విజ్ఞానాన్ని పంచిన తిరుగులేని సమాచార మాధ్యమం. ఆధునిక టెక్నాలజీ రాకతో అంతరించే దశకు చేరుకున్న జానపద కళారూపాలు.. తిరిగి అదే సాంకేతిక పరిజ్ఞానం దన్నుతో కొత్త పుంతలు తొక్కుతున్నాయి.

- ఉత్తరాంధ్ర జానపదాన్ని కాపాడుతున్న భగవాన్ దాసు
- నేడు ప్రపంచ జాపద కళా దినోత్సవం

ఆరిలోవ : ఉత్తరాంధ్ర జానపదం మరుగున పడకుండా నేటి కళాకారులు కొందరు చేస్తున్న కృషి మరువలేనిది. ప్రస్తుతం కంప్యూటర్ యుగం పరుగులు పెడుతున్న సమయంలో సైతం జానపదానికి జీవం పోయాలనే తపన కనబరుస్తున్నారు. భవిష్యత్ తరాలకు దీని మాధుర్యం అందించాలనే ఆలోచన చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆరిలోవ ప్రాంతంలో నివాసముంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు రట్టి భగవాన్ దాసు ఉచితంగా జానపదాలను నేర్పుతున్నారు. ఈనెల 22న ప్రపంచ జానపద కళా దినోత్సవం సందర్భంగా ఆయన సేవలు గురించి తెలుసుకొందాం..

భగవాన్ దాసుది శ్రీకాకుళం జిల్లా కంచిలి. ఆయన ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడే జానపద నాటకాలపై ఆసక్తి కనబరిచారు. నాటకాలు చూడటంతో పాటు వాటిని నేర్చుకొన్నారు. ఆ తర్వాత జానపద గీతాలు రాయడం, పాడటం, ప్రదర్శనలు ఇవ్వడం మొదలు పెట్టారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, హైదరాబాద్ తదితర పట్టణాలలో వందలాది ప్రదర్శనలు ఇచ్చారు. సుమారు 250కి పైగా జ్ఞాపికలు సొంతం చేసుకొన్నారు. ప్రతిభా ప్రదర్శనలకుగాను ప్రముఖ వ్యక్తులతో ఉత్తమ అవార్డులు అందుకొన్నారు. సినీ నటులు కైకాల సత్యనారాయణ, ఆర్.నారాయణమూర్తి, మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య, పి.ఐ బాలరాజు, గీతారెడ్డి తదితరులచే అవార్డులు అందుకొన్నారు. విప్లకారులు వంగపండు ప్రసాద్, ఆర్.నారాయణమూర్తితో కలసి జానపద గీతాలు ఆలపించారు. జానపదం అంతరించిపోకుండా భవిష్యత్ తరాలువారికి అందించాలనే ఆలోచనతో ఉచితంగా ఈ కళను నేర్పుతున్నట్లు ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలు జానపద కళపై ఆసక్తి కనబరచాలని ఆయన కోరుతున్నారు.

కళా పీఠం ద్వారా..

భగవాన్ దాసు ఉపాధ్యాయ వృత్తిలో ఉండగానే శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతంలో కళా పీఠం ఏర్పాటు చేసి ఐదు జానపద కళా బృందాలను తయారు చేశారు. వారి ద్వారా ప్రజలకు జానపదాలపై ఆసక్తి కలిగించి మేల్కొలిపారు.



విద్యార్థులకు జానపద గీతం నేర్పుతున్న భగవాన్‌దాసు మాస్టారు

2022లో ఆయన ఉద్యోగం విరమణ పొందారు. ఆ తరువాత ఆరిలోవలో స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. జానపద కళను ఇక్కడవారికి అందించాలనే ఆలోచనతో ఆరిలోవలో భరత్‌నగర్‌లో కళా పీఠం ఏర్పాటు చేశారు. దానిలో ఉచితంగా జానపదాలు నేర్పుతున్నారు. ఇక్కడ 12 మంది పాఠశాల పిల్లలు జానపద గీతాలు నేర్చుకొంటున్నారు. వారితో పాటు పెద్దలకు డోలక్, ఆర్మోనియం, జముకు, కీబోర్డు, కంజిరా, తాళాలు, తదితర పరికరాలు ఏర్పాటు చేసి తర్ఫీదు ఇస్తున్నారు.



జముకు వాయిస్తున్న భగవాన్‌దాసు

జనపదాలు రాయడంలో దిట్ట

భగవాదాసు పలు జానపద గీతాలు రాశారు. జానపద గీత మాలిక (36 పాటలు), శ్రీ షిర్డీ సాయి భక్తి మాలిక, కంచి కామాక్షి భక్తి మాలిక, అంబేడ్కర్ గురించి, దళిత చైతన్య గీత మాలిక, జనహితం, దళిత హితం, పాతంతో పాఠాలు, చింతలూరు పిల్ల తదితర గీతాలు రాసి ఆలపించారు.

కళాభారతిలో నేడు జానపద దినోత్సవం

మద్దిలపాలెం: మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం నవ చైతన్య కళానాట్య సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని నిర్వహకులు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ వేడుకలను సెంచూరియన్ వైస్ చాన్సలర్ జి.ఎస్.ఎన్.రాజు, ఎస్ఆర్‌కే ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ చైర్మన్ ఎం. సత్యనారాయణరాజు ప్రారంభించనున్నారు. అనంతరం జానపద కళారూపాలు ప్రదర్శించనున్నారు.

24న పార్లమెంటు ఆఫీషియల్ లాంగ్వేజ్ కమిటీ రాక

మహారాణిపేట: పార్లమెంటు ఆఫీషియల్ లాంగ్వేజ్ కమిటీ ఈనెల 24న విశాఖ వస్తోంది. రెండు రోజుల పాటు విశాఖలో పర్యటించనుంది. 24న ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్, పోస్టు మాస్టర్ జనరల్, ఆల్ ఇండియా రేడియో, రైల్వే డీఆర్ఎం కార్యాలయాలను బృందం పరిశీలించనుంది. ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా విశాఖపట్నం, సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ స్టేషన్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, తుపాన్ హెచ్చరిక కేంద్రం తదితర కార్యాలయాలను కూడా సందర్శిస్తారు. 25న సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ సెంటర్, భారత ఆహార సంస్థ, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, రైల్వే వికాస్ నిగామ్ లిమిటెడ్ తదితర కార్యాలయాలను కూడా సందర్శించనున్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

విశాఖ విద్య : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ టీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన విద్యా సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో వైఎస్సార్ టీఎఫ్ ముందుంటుందన్నారు. 1998 మినిమమ్ టైం స్కేల్, కేజీబీవీ, గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీసు పరమైన ఇబ్బందులపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి మైదాన ప్రాంతానికి తీసుకొచ్చేలా ఉన్నతాధికారులతో చర్చించి, సానుకూల నిర్ణయం వెలువడేలా సంఘం తరుపున కృషి చేస్తామన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సుధీర్ మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు అండగా ఉంటూ, సంఘం బలోపేతానికి జిల్లా స్థాయి బాధ్యులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చొక్కాకుల సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా బాదిరెడ్డి గంగాధర్‌ను ఎన్నుకున్నారు.

వారియర్స్ సూపర్ విజయం

- సీజన్‌లో తొలిసారిగా సూపర్ ఓవర్
- వైజాగ్ వారియర్స్‌ను వరించిన విజయం



అర్ధసెంచరీ భాగస్వామ్యాన్నందించిన టైగర్స్ కెప్టెన్ రికీతో మహీప్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ రెండో సీజన్‌లో రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్ జట్ల మధ్య మ్యాచ్ టైగా ముగిసింది. సూపర్ ఓవర్‌లో వైజాగ్ వారియర్స్‌ను విజయం వరించింది. వైఎస్సార్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వైజాగ్ వారియర్స్ 171 పరుగులు చేసింది. ఓపెనర్ అర్జున్ 30, ప్రశాంత్ కుమార్ 73, కెఎస్ఎన్ రాజు(8), కెప్టెన్ కరణ్ షిండే(8), ధృవ్ కుమార్ 24, తరుణ్ 15 పరుగులు చేశారు. కమరుద్దీన్ నాలుగు వికెట్లు తీయగా హరిశంకర్, అఖిల్, సాకేత్ ఒకో వికెట్ తీశారు. ప్రతిగా రాయలసీమ కింగ్స్ ఓపెనర్లు కెప్టెన్ హనుమ విహారి 71, అభిషేక్ 58 పరుగులు చేశారు. వీరి జోడి తొలి వికెట్‌కు ఏకంగా 105 పరుగుల భాగస్వామ్యాన్నందించింది. వీరారెడ్డి 6, గిరినాథ్ 12 వంశీకృష్ణ 13 పరుగులు చేశారు. రాయలసీమ కింగ్స్ చివరికి ఆరువికెట్లకు 171 పరుగులకే ముగించడంతో మ్యాచ్ టైగా ముగిసింది. కార్తీక్ రామన్ రెండు, గిరీష్‌కుమార్, సిద్ధార్థ చెరో వికెట్ తీశారు.

సూపర్ ఓవర్

రాయలసీమ కింగ్స్ మూడు బంతుల్లో ఒక పరుగుకు రెండు వికెట్లు కోల్పోగా వైజాగ్ వారియర్స్ రెండు పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో కింగ్స్ విజయ పరంపరకు వారియర్స్ అడ్డుతగిలింది. వారియర్స్‌కు నాలుగు మ్యాచ్‌ల్లో ఇదే తొలివిజయం.

లయన్స్‌ను నిలువరించిన టైగర్స్

ఏపీఎల్-2లో భాగంగా వైఎస్ఆర్ స్టేడియంలో సోమవారం జరిగిన పోటీలో ఉత్తరాంధ్ర లయన్స్‌ను బెజవాడ టైగర్స్ నిలువరించాయి. లయన్స్‌పై ఏడు వికెట్ల తేడాతో టైగర్స్ విజయం సాధించింది. తొలి మూడు మ్యాచ్‌ల్లో ఓడిన టైగర్స్ ఈ మ్యాచ్‌లో విజయంతో ప్లేఆఫ్ ఆశల్ని సజీవంగా ఉంచుకుంది.



లాంగ్ ఆఫ్ మీదుగా బంతిని తరలించబోయి రవికిరణ్‌కు క్యాచ్ ఇచ్చిన కింగ్స్ కెప్టెన్ విహారి

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఉత్తరాంధ్ర లయన్స్ నాలుగు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేసింది. ఓపెనర్ గుల్ఫామ్ పరుగుల ఖాతా తెరవకుండానే ఔట్ కాగా మరో ఓపెనర్ కెప్టెన్ భరత్ 25 పరుగులు చేశాడు. రాహుల్ 41, తపస్వి 28, శ్యామ్ సుందర్ 45, శ్రీనివాస్ 16 పరుగులు చేశారు. సంతోష్, షోయబ్, లలిత్, అఖిల్ తలో వికెట్ తీశారు. ప్రతిగా బెజవాడ టైగర్స్ 18.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. ఓపెనర్ అభినవ్(8), మనీష్(17), కెప్టెన్ రికీబుయ్ 41, మహీప్‌కుమార్ 77, షోయబ్ 15 పరుగులు చేశారు. పృథ్వీ, తేజస్వి రఫీ ఒకో వికెట్ తీశారు.

కుమార్తె మృతిపై సీపీకి ఫిర్యాదు?

సీతమ్మధార : తన కుమార్తె మృతిపై పలు అనుమానాలున్నాయని, తక్షణం విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని మృతురాలి తల్లి నగర పోలీసు కమిషనర్ త్రివిక్రమ వర్మకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. వివరాలు ఇలా...నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నెహ్రూబజార్ ప్రాంతంలో హాస్టల్‌లో ఉంటూ ఓ విద్యార్థిని ఇంటర్ చదువుతోంది. నెలన్నర క్రితం హాస్టల్ భవనం పైనుంచి కింద పడిమృతి చెందింది. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలావుండగా కేసు నీరుగారుస్తున్నారని, తన కుమార్తె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ విద్యార్థిని తల్లి సోమవారం సీపీకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీంతో ఫోర్త్ టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్రావులను పోలీసు కమిషనరేట్‌కు పిలిపించుకుని సీపీ వివరాలు తెలుసుకుని, సమగ్ర విచారణకు ఆదేశించినట్టు తెలిసింది.

జాబ్‌మేళా రేపు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి పేర్కొన్నారు. అరబిందో ఫార్మసీ, హెటిరో డ్రగ్స్, శ్రీరామ్ చిట్స్, ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎమ్, అసోసియేట్స్, టీసీఎల్ కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో, బీఎస్సీ కెమిస్ట్రీ, ఎం ఫార్మసీ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

బండారూ.. తప్పుడు ప్రచారం మానుకో..

- ఈవ్‌టీజింగ్‌కి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు తక్షణ చర్యలు
- సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టు సరికాదు
- మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ



మాట్లాడుతున్న గెడ్డం ఉమ

సాక్షి, అనకాపల్లి: మహిళల భద్రతకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వంపై టీడీపీ నేత బండారు సత్యనారాయణ మూర్తి లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ మండిపడ్డారు. బండారు సోషల్ మీడియాలో చేసిన తప్పుడు పోస్టులపై సోమవారం ఆమె ఘాటుగా స్పందించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. పరవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 13వ తేదీన తన సోదరిపై సంతోష్‌కుమార్ అనే ఈవ్ టీజింగ్‌కి పాల్పడ్డాడు. ఆమె ధైర్యంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మరుక్షణమే పోలీసులు నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన గుంటూరుకు చెందిన సంతోష్‌కుమార్ పరవాడ ఫైలాన్ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మహిళ గౌరవ భంగానికి చెందిన అంశాన్ని బండారు సత్యనారాయణమూర్తి లాంటి వ్యక్తులు రాజకీయం చేయడం సరికాదని ఆమె హితవుపలికారు. కుమార్తె సమానురాలైన ఆడపిల్లపై ఈవ్‌టీజింగ్‌కి పాల్పడితే.. దాన్ని అత్యాచారయత్నమని.. ఆ కుటుంబ గౌరవాన్ని బయటకు తీసేవిధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సంస్కారమా..? బండారు అని ప్రశ్నించారు. ఇదేనా మీరు మహిళలకు ఇచ్చే గౌరవం అని మండిపడ్డారు. మహిళా భద్రత కోసం దిశ పోలీస్‌స్టేషన్‌లు, దిశ యాప్‌లను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు.

తప్పుడు పోస్టులపై ఎస్పీకి ఫిర్యాదు

సోషల్ మీడియాలో తనపై తప్పుడు పోస్టులు పెడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ కోరారు. సోమవారం ఈమేరకు ఆమె అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణకు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా తనపై వివిధ మాధ్యమాలలో అసత్య పోస్టులు పెడుతూ తీవ్ర ఆరోపణలు చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్పీకి ఆమె విజ్ఞప్తి చేశారు. ఎటువంటి ఆధారాలు లేకుండా మహిళలపై తప్పుడు పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

క్షతగాత్రులకు పలువురి పరామర్శ

ఎంవీపీకాలనీ: పాడేరు ఘాట్‌రోడ్డులో ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయాలపాలై మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పలువురు రాజకీయ నాయకులు పరామర్శించారు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన కిల్లో బోడిరాజు (39), బుట్ట చిన్నమ్ములు (48), బుట్ట దుర్గాభవానీ (14), బుట్ట రామన్న (14)తో పాటు సామర్ల బాబురావు (50) మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్సీ కుంభా రవిబాబు క్షతగ్రాతులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న ఆయన అనంతరం వైద్యులతో మాట్లాడారు. వారికి అవసరమైన మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్ సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు తదితరులు క్షతగాత్రులను పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మెడికవర్ వైద్యులు వెల్లడించారు.

రైలు నుంచి జారిపడి చత్తీస్‌ఘడ్‌వాసి మృతి

తాటిచెట్లపాలెం: కదులుతున్న రైలు నుంచి జారిపడి చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి చెందినట్టు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం బోకారో ఎక్స్‌ప్రెస్‌లో కూలిపనుల నిమిత్తం బెంగళూరు వెళ్లేందుకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కొందరు ప్రయాణిస్తున్నారు. బోగీ లోపల ఖాళీ లేక డోర్ దగ్గర కొందరు కూర్చున్నారు. రైలు పెందుర్తి సమీపంలో చింతల అగ్రహారానికి వచ్చేసరికి జ్ఞాన ప్రకాష్ (49) బాత్రూంకు వెళ్లే ప్రయత్నంలో కాలుజారి కదులుతున్న రైలునుంచి పడి మరణించాడు. జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు ఆదేశాల ప్రకారం విశాఖపట్నం జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.